www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 27 మే 2024
5
అన్నమయ్య



కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -రాయచోటి

2024 సార్వత్రిక ఎన్నికలు మే 13న ముగిసిన విషయం అందరికీ తెలిసినదే. ఆదివారం అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో జూన్4న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను డిఎస్‌పి రామచంద్రరావు ఆధ్వర్యంలో తహశీల్దార్ జయన్న, డిప్యూటీ తహశీల్దార్ రామాంజనేయులు, అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి, మండల సర్వేయర్ మదనమోహన్‌రెడ్డి పరిశీలించారు. పరిశీలన చేశారు. డిఎస్‌పి కౌంటింగ్ ప్రక్రియ విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. తీసుకోవలసిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కళాశాల వద్దనున్న పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అడుగంటిన ప్రాజెక్టులు



జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ అడుగంటిపోయాయి. గండికోట మొదలుకుని ఝరికోన వరకు జలాశయాలన్నీ తాగునీటి అవసరాలు తీర్చడానికి పరిమితమవుతున్నాయి. వీటిని సాగునీటి అవసరాలకు ఉద్దేశించి నిర్మించారు. కానీ ఆచరణలో తాగునీటి అవసరాలకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత వేసవిలో తాగునీటికి కటకటే ఎదురవు తోంది. ఇప్పటికే కడప, బద్వేల్ వంటి పట్టణాల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే.

- ◆ డెడ్‌స్టోరేజీ దిశగా జలాశయాలు
- ◆ తాగునీటికీ..కటకట

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని గండికోట, బ్రహ్మంసాగర్, మైలవరం, పైడిపాలెం, సర్వరాయసాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, అన్న మయ్య, వెలిగల్లు, చిత్రావతి, లోయర్ సగిలేరు, దిగువ సగిలేరు, బుగ్గ వంక ప్రాజెక్టుల్లో 82.258 టిఎంసిలు నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వర్షాలు లేకపోవడంతో 17.4044 టిఎంసిలకు చేరుకుని డెడ్‌స్టోరేజీ దిశగా పరుగులు తీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. పైగా ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను సక్రమంగా మెయింటె నెన్స్ చేయకపోవడంతో ప్రమాదకర సంకేతాలను ఇస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

గండికోట ప్రాజెక్టు

గండికోట ప్రాజెక్టు 26.850 టిఎంసిల సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 2.806 టిఎంసిలు మాత్రమే నీరు నిల్వ ఉంది. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుంచి సుమారు 106 కిలోమీటర్ల మేరకు గాలేరు-నగరి ఫేజ్-2 దశలోని పనులు పూర్తి చేయాల్సి ఉంది. వైసిపి సర్కారు హయా ంలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడంతో గతేడాది నుంచి సాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆదుకున్న సంగతి తెలిసిందే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నైరుతి రుతు పవనాలు అనుకూలిస్తే సాగు, తాగునీటి అవసరాలు తీరే అవకాశం ఉంటుంది..

మైలవరం రిజర్వాయర్

మైలవరం 9.960 టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. ప్రస్తుతం 0.501 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంటోంది. దీన్ని ఎక్కువగా సాగు నీటి అవసరాల నిమిత్తం ఏర్పాటు చేశారు. దీనికి లోపలి వైపున సప్లయ్ కెనాల్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ప్రస్తుతం మైలవరం రిజర్వాయర్ తాగునీటి అవసరాలను తీర్చడానికి పరిమితమైంది.


మైలవరం ప్రాజెక్టు

చిత్రావతి రిజర్వాయర్

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 10.229 టిఎంసిల సామ ర్థ్యంతో నిర్మితమైంది. ప్రస్తుతం 4.030 టిఎంసిల నిల్వను కలిగి ఉంది. డెడ్‌స్టోరేజీ దిశగా పరుగులు తీస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అందించ లేని దుస్థితికి చేరుకుంది.

బ్రహ్మంసాగర్ రిజర్వాయర్

బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ 17.73 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. 2.329 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ కింద సుమారు 1.50 లక్షల పైచిలుకు ఆయకట్టు ఉంది. తెలుగు గంగ కాలువలో పూడికతీత పనులను అసంపూర్తిగా చేయడంతో శ్రీశైలం నుంచి విడుదలైన నీరు కాలువల లీకేజీల మయమైంది. దీంతో విడుదల చేసిన సాగునీరు పూర్తి స్థాయిలో రిజర్వాయర్‌ను చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

సబ్సిడీ రిజర్వాయర్-1

తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన సబ్సిడీ రిజర్వాయర్-1, 2. 134 టిఎంసీల సామర్థ్యంతో నీటి నిల్వను కలిగి ఉంది. ప్రస్తుతం 0. 185 టిఎంసిల నిల్వ నీటిని కలిగి ఉంది. దీంతో తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితమవుతోంది.

సబ్సిడీ రిజర్వాయర్-11

తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన సబ్సిడీ రిజర్వాయర్-11 1.447 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. ప్రస్తుతం 0.149 టిఎంసిల నీటి నిల్వలను కలిగి ఉంది.

వెలిగల్లు ప్రాజెక్టు

వెలిగల్లు ప్రాజెక్టు 4.64 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 1.154 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. దీని కింద 24 వేల హెక్టార్ల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం వెలిగల్లు ప్రాజెక్టు రాయచోటి పట్టణవా సుల తాగునీటి సమస్యను తీరుస్తోంది. ప్రాజెక్టు నిర్మించిన పదేళ్లలో ఒకసారి కూడా నిండిన అవకాశాలు లేవని తెలుస్తోంది.

వామికొండ

వామికొండ రిజర్వాయర్ 1.658 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మి తమైంది. ప్రస్తుతం 0.571 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీని కింద 20 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు అసంపూర్తి నిర్మాణంతో సాగు నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేయలేని దుస్థితి దాపురించింది.

సర్వరాయసాగర్ :

సర్వరాయసాగర్ రిజర్వాయర్ 3.060 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో నిర్మితమైంది. ప్రస్తుతం 0.474 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. దీని కింద 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో అరకొర నీటి నిల్వలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

పైడిపాలెం :

పైడిపాలెం రిజర్వాయర్ ఆరు టిఎంసిల సామర్థ్యంతో నిర్మితమైంది. ప్రస్తుతం 3.893 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. 50 శాతం నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉండడం స్వల్ప ఊరట కలిగించడం మినహా ఎటువంటి ప్రయోజనమూ లేదు.

బుగ్గవంకప్రాజెక్టు :

బుగ్గవంక ప్రాజెక్టు 0.506 టిఎంసిల నీటి సామర్థ్యాన్ని కలిగి ఉం ది. ప్రస్తుతం 0.051 టిఎంసిల నీటి నిల్వను కలిగి ఉంది. తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితమైనట్లు తెలుస్తోంది.

లోయర్ సగిలేరు ప్రాజెక్టు :

తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా లోయర్‌సగిలేరు ప్రాజె క్టు నిర్మితమైంది. 0.169 టిఎంసిల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మి తమైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో చుక్కనీరు లేకపోవడం గమనార్హం. దీని పరిధిలో 13 వేల ఎకరాల ఆయకట్టు సాగయ్యే అవకాశం ఉంది.


వరదల్లో కొట్టుకు పోయిన అన్నమయ్య ప్రాజెక్టు


వెలిగల్లు ప్రాజెక్టు

కొలిక్కి వస్తున్న శేషాద్రి హత్య కేసు

పోలీసుల అదుపులో పలువురు నిందితులు

హత్య చేయడానికి ఉపయోగించిన ఇన్నోవా కారు, మారణాయుధాలు సీజ్


హత్య జరిగిన ఇంటిలో ఆధారాలు సేకరిస్తున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి


శేషాద్రి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె అనపగుట్ట, శ్రీవారి నగర్‌లో శనివారం వేకువ జామున దారుణ హత్యకు గురైన రామారావు కాలనీ నివాసి పుంగనూరు శేషాద్రి అలియాస్ శేషు హత్య కేసు తీగ లాగితే డొంక కదులుతోంది. జిల్లా ఎస్‌పి కృష్ణా రావు ఆదేశాలతో డిఎస్‌పి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విభిన్న కోణాల్లో లోతుగా దర్యాప్తు చేపట్టి కూపి లాగుతున్నారు. మదనపల్లెకు చెందిన ఓ ప్రధాన కుల సంఘానికి చెందిన భూ దందాల ముఠాలోని కొందరిని పోలీసులు ఇప్పటికే పట్టుకుని విచారించడంతో తెర వెనక ఉన్న కథ నాయకుల (లీడర్ల) హస్తం ఉందని తేలింది. సంఘాల పేరుతో పెద్దమనుషులుగా చలామణి అవుతూ కబ్జాలు, దందాలు, సెటిల్‌మెంట్లు, వినకపోతే భౌతిక దాడులు, చివరకు హత్యలు చేయించే స్థాయికి ఎదిగిపోయిన నేర గాళ్ల గుట్టు ఈ హత్య కేసుతో పోలీసులు వెలుగులోకి తీయనున్నట్లు తెలిసింది. హత్య కేసును ఛేదించే పనిలో నిమగ్నమైన పోలీసులు హత్యకు పాల్పడ్డ భూ దందాల బ్యాచ్‌ల లిస్టు, మదనపల్లె కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా చాలా చోట్ల మారణకాండాలకు పాల్పడిన రౌడీ షీటర్ల భాగోతాలు ఇప్పటికే తెలుసుకున్నట్లు సమాచారం. ఇలాంటి ముఠాలు ఇంకా ఎక్కడెక్కడ ఉన్నాయి. ఎవరెవరిని ఏమి చేసింది, ఎలాంటి ఘాతుకాలకు వడిగట్టింది, బెదిరింపులకు పాల్పడి ఎంతెంత వసూలు చేసింది, ఎక్కడెక్కడ భూ కబ్జాలు, దందాలు చేసింది వెలికి తీసే పనిలో నిమగ్నమాయ్యారు. కాగా ఇదివరకే శేషాద్రిని హత్య చేసిన హంతకులు ఉపయోగించిన ఇన్నోవా కారు సహా మారణాయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకోగా, హత్యలో ప్రమేయమున్న కొందరిపై డిఎస్‌పి ప్రసాద్ రెడ్డి, సిఐలు వల్లి బాష, యువరాజు, శేఖర్, సద్గురుడు దృష్టి సారించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని ఆదివారం డిఎస్‌పి పరిశీలించి ఘటన స్థలంలో లభించిన కీలక ఆధారాలను వీడియో కెమెరాలో చిత్రీకరించారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితులు ఇస్తున్న కీలక సమాచారంతో హత్య కేసు దర్యాప్తు ముందుకు సాగుతోంది. మరో ఒకరిద్దరు కీలకంగా భూ దందాలను ప్రోత్సహిస్తున్న ముఠా నాయకులు పట్టుబడితే హత్య కేసు కథ సుఖాంతమైనట్లేనని పోలీసు వర్గాలే చెబుతున్నాయి.


హంతకులు ఉపయోగించిన ఇన్నోవా కారు

'అనునాదాలు' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె

ప్రముఖ రచయిత, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కోడూరు ప్రభాకర్‌రెడ్డి రచించిన 40వ గ్రంథమైన 'అనునాదాలు' ఆదివారం ఉదయం ప్రజాచైతన్య స్రవంతి ఆధ్వర్యంలో మదనపల్లె జ్ఞానోదయ ఉన్నత పాఠశాల సెంట్రల్ హాలులో ఆవిష్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ గొల్లపూడి తిరుపతి రావు మాట్లాడుతూ ప్రసిద్ధ హిందీ, సంస్కృత, ఆంగ్ల కవుల పద్యాలను తెలుగులోకి అనువదించి 300 సంపుటల గ్రంథాన్ని అందించిన ప్రభాకర్‌రెడ్డి అభినందనీయులని పేర్కొన్నారు. విశ్రాంత బ్యాంకు మేనేజరు వై. శ్రీనివాసులు రెడ్డి గ్రంథావిష్కరణ చేసిన గ్రంథకర్త ఔన్నత్యాన్ని కొనియాడారు. అనంతరం కామకోటి ప్రసాద రావు విద్యార్థులకు భాష మీద సాధికారత ఏర్పడాలంటే పద్య పఠనం ఎంతో అవసరమని చెప్పారు. ఇలాంటి గ్రంథాలను హైస్కూల్ విద్యార్థులు తప్పక అధ్యయనం చేయాలని అన్నారు. ప్రఖ్యాత నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ అలుగుంటి సిద్ధారెడ్డి మాట్లాడుతూ మెడిసన్ చదువుతున్నప్పటి నుంచి ప్రభాకర్ రెడ్డితో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. తిరుపతి నుంచి విచ్చేసిన డి.ఎం.ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎన్. సుమతి రెడ్డి ప్రసంగిస్తూ బీటలు వారుతున్న మానవ సంబంధాలను గూర్చి ప్రస్తావించారు. అనంతరం పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రఖ్యాత వైద్య నిపుణులు డాక్టర్ జహంగీర్‌బాషా, నీలకంఠనరసరాజు(హైదరాబాదు), ఎం.పీ.మోహన్ గుప్తా, రామి గాని ఉమాదేవి. ఇండ్లూరి అంజలి, శాంత కుమారి, హెచ్. ఎం. బి. విజయలక్ష్మి, వి.యం. నాగరాజు, రామ మోహన్ నాయుడు, కె.బాలకృష్ణ, డాక్టర్ కవితశ్రీ, ధర్మాధిపతి నాగభూషణరావు, అలుగుంటి రామకృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, వై.మధు, చైతన్య భారతి సంపత్ కుమార్, గణముక్కల శ్రీధర్, కొడవటి ప్రభాకర్, ప్రొఫెసర్ శ్రీనివాసులు, ప్రొఫెసర్ జ్ఞాని చంద్రశేఖర్ శర్మ, అండే కృష్ణమూర్తి పాల్గొన్నారు.



గ్రంథావిష్కరణ చేస్తున్న అతిథులు,కవులు

రక్తదానం అభినందనీయం

ప్రజాశక్తి-మదనపల్లి

రక్తదానం చేయడం అభినందనీయమని విజయభారతి ఇంగ్లీషుమీడియా హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. సేతు పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లి యూత్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ కరాటే క్లబ్ నిర్వాహకులు, మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఏ ఆర్. సురేష్ నేటి కరాటే మాస్టర్లకు ఆదర్శనీయమన్నారు. చిన్ననాటి నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఉన్నత స్థానానికి చేరుకోవడానికి అలుపెరగని కృషి చేస్తున్నారని చెప్పారు. కరాటే మీద ఆసక్తితో ఎన్నో కష్టాలకు ఓర్చి కరాటే శిక్షణ పొంది మాస్టర్‌గా ఎదిగారని కొనియాడారు. మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తూ ఎందరో మాస్టర్లను తయారు చేసిన ఘనత సురేష్‌కు దక్కుతుందని అన్నారు. మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వడం, మహిళలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇవ్వడం, పోలీసులు, మహిళ పోలీసులకు శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రక్తదాన కేంద్రం ఇన్‌చార్జ్ డాక్టర్ బి.భార్గవ్, డాక్టర్ లీలావతి,యూత్ కరాటే క్లబ్ కార్యదర్శి ఎం మణి సాయి, వన్ టౌన్ హెడ్ కానిస్టేబుల్ శివ,కామ్రేడ్ క్రిష్ణమూర్తి, వికలాంగుల సంఘ అధ్యక్షులు మౌలాలి , కరాటే రమణ, కరాటే సీనియర్ బ్లాక్ బెల్ట్ టి మహేశ్వర, షేక్ మీస్బా, అనిత్ కృష్ణ, నితిన్ సాయి, కరాటే బ్లాక్ బెల్ట్స్ సంజన, ఐ మాన్, కరాటే విద్యార్థులు వారి తల్లిదండ్రులు, జిల్లా ఆసుపత్రి రక్త నిధి ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న దాతలు

జిల్లా క్రికెట్ జట్టుకు నందలూరు క్రీడాకారులు

ప్రజాశక్తి-నందలూరు

కడప జిల్లా సీనియర్స్ క్రికెట్ జట్టుకు నందలూరు క్రికెట్ సబ్ సెంటర్ నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జాఫర్‌అలీఖాన్, ఆదీల్ హుస్సేన్, పృథ్వీరాజ్, మారుతి శంకరా చారి, గిరీష్ తేజ, స్టాండ్‌బైగా హరిప్రసా ద్‌లు ఎంపికైనట్లు హెడ్ కోచ్ గయాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆది వారం ఆయన మాట్లాడుతూ నందలూరు సబ్ సెంటర్ నుంచి గతంలో కూడా అండర్-12, 14, 16, 19, 23, సీనియర్స్ విభాగాలలో జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ ఎంతో మంది క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సం వత్సరం కూడా నందలూరు సబ్ సెంటర్ నుంచి ఆరుగురు కీడాకారులు సీని యర్ జట్టుకు ఎంపిక అయినందున అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడి, ట్రైనర్ శివకోటి, క్యురేటర్ హరికృష్ణ, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు తంబళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమ నిబంధనకు లోబడి మండల సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్యం, వైద్యం, వ్యవసాయం, విద్యాశాఖల పై సమగ్ర శిక్ష ప్రగతి పై సమీక్ష జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు ఎంపిపి, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

తగ్గిన మామిడి దిగుబడి

నష్టాల ఊబిలో రైతులు - మార్కెట్‌లో ధరల మంట


పూతలేని మామిడిచెట్టు

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలో వందల సంఖ్యలో మామిడి తోటలు ఉన్నాయి. రైతులు ఉత్సాహంగా మామిడి సాగు చేశారు. ఈ ఏడాది మామిడి తోటలో పూత దశ నుంచే అనేక చీడపీడలు ఏర్పడడంతో కాపు తగ్గిపోయింది. ఈ ఏడాది మామిడ కాయల దిగుబడి తక్కువగా ఉండటంతో ధరలు అధికమయ్యాయి. ప్రస్తుతం ధరలు చూసిన ప్రజలు పెద్దగా మామిడి జోలికి వెళ్ళటం లేదు. మండల పరిధిలోని అనంతసముద్రం, వత్తలూరు, బావికాడ పల్లె, టి.కమ్మపల్లి, కొమ్మన వారిపల్లి తదితర గ్రామాల్లో దాదాపు 1000 ఎకరాల్లో పైగా రైతులు మామిడి సాగు చేశారు. ఏడాది అనూహ్యంగా ఎండలు పెరిగాయి. దీనికి తోడు వర్షభావ పరిస్థితులతో మామిడి తోటల్లో దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు. గతంతో పోల్చుకుంటే ఏడాది మామిడికాయల దిగుబడి తక్కువగానే ఉంది. మామిడికాయల మండి కూడా మండల కేంద్రమైన పుల్లంపేట నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. మామిడి తోటలున్న రైతులు నుంచి మామిడికాయలను దళారులు దిగుమతి చేసుకొని రైల్వే కోడూర్ మార్కెట్ మండికి తరలించేవారు. ఈ ఏడాది దిగుబడి తగ్గడం, ధరలు అధికం కావడంతో మార్కెట్ కూడా పడిపోయింది. మామిడి తోటలో పూత రాలిపోయి దిగుబడి శాతం తగ్గిందని రైతులు పేర్కొన్నారు.

మార్కెట్లో పెరిగిన మామిడి ధర

పంట తగ్గడంతో మార్కెట్లో ధరలు పెంచేశారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో మామిడికాయ ప్రియులు వేసవిలో ఎక్కువగా తినగలిగే మామిడి కాయల ధరలను చూసి కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయిందని పండ్ల వ్యాపారులు చెబుతున్నారు.

పండిన కాయలకు రుచి తగ్గాయి

వర్షాభావ పరిస్థితుల కారణంగా చెట్లకు అవసరమైన పోషకాలు అందకపోవడంతో వచ్చిన కొద్దిపాటి దిగుబడి కూడా రుచికరంగా లేదని ప్రజలు చెబుతున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం, తోడు చీడ పీడలు అధికం కావడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచారంగా మారింది. దీంతో కొద్దిపాటి కాయలు కూడా రుచికరంగా లేవని రైతులు చెబుతున్నారు. మార్కెట్లో కొనుగోలు దారులను ఆకర్షించేందుకు కార్బైడ్ ఉపయోగించడంతో అనారోగ్య పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ ఏడాది రైతులకు నష్టమే..

మండల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉన్నమామిడి రైతులు నష్టాలు చవిచూసే పరిస్థితి ఏర్పడింది. నేను పది ఎకరాల్లో మామిడి చెట్లు పెంచుతున్నాను. ఈ ఏడాది అధిక దిగుబడివస్తుందని ఆశపడ్డాను. చీడ, పీడల వల్ల దిగుబడి తగ్గింది. పెట్టుబడి మాత్రం అధికంగా పెట్టాను. దిగుబడి లేకపోవడంతో నష్టమే మిగిలింది.



- కొమ్మ వెంకటరమణ, రైతు


మురుగు కాలువకు మరమ్మతు పనులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మురుగు కాలువకు మరమ్మతులు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పట్టణంలో మురుగుకాలువల నిర్మాణాలను అసంపూర్తి చేపట్టడంతో ఆదివారం మిగిలిన పనులను సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో కాలువలకు మరమ్మతు పనులు పూర్తి చేశారు. గేటు నుంచి పక్కీరాఒడ్డిగారిపల్లి, కుశావతినది వరకు రోడ్డు ఇరువైపులా మురికి కాలువ నిర్మాణ పనులు జరిగాయని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. పావని హాల్ సర్కిల్ వద్ద రవిచంద్ర స్కూలు పోయే వీధిలో పనులు చేయకుండా పాత కాలువను అలాగే ఉంచారని అన్నారు. పైకాలువల నుంచి మురుగు నీరు ఎక్కువగా రావడంతో పాత కాలువల్లోని మురుగునీరంతా రోడ్డు ప్రవహించి దుర్గంధం వెదజల్లుతోందని అన్నారు. వార్డు మెంబర్ మాతమ్మ గ్రామ సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి దృష్టికి తీసుకెళ్లిందని అన్నారు. సర్పంచ్ చొరవ తీసుకొని జెసిపి యంత్రాన్ని ఉపయోగించి ఆ కాలవను తగ్గ ప్రాంతంలో తీసివేసి మరమ్మతులు చేయడానికి నుంచి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.


దారిలేక రద్దీగా ఉన్న సంత

సంతకు దారేదీ.?

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బస్టాండ్ ఆవరణంలో పది ప్రతి బుధవారం కూరగాయల సంత జరుగుతుంది. మండలంలోని 17 గ్రామాల నుంచి కాకుండా పెద్దమండెం, గుర్రంకొండ, కల్చర్ల, గాండ్లపెంట, కదిరి వంటి ప్రాంతాల నుంచి అటు వ్యాపారస్తులు ఇటు రైతులు ఇక్కడ వ్యాపార లావాదేవీలు కొనసాగించడానికి వస్తుంటారు. సంత ప్రాంతంలో ఎక్కువ ఖాళీ స్థలం ఉన్న చోట దుకాణాల ఏర్పాటు చేసుకోరు గానీ బస్టాండ్ నుంచి నేరుగా వెళ్లే దారిలోనే దుకాణాలు, తోపుడుబండ్లు, అన్ని అక్కడ ఉంచడం ద్వారా దారిలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు కొనడానికి వెళ్లే వారికి దారి లేక ఒకరిపై ఒకరు తోసుకొనే పరిస్థితి ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. వీటిపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి రోడ్డుపై ఉన్న దుకాణా లను తీసివేసి సంత వెనుక భాగంలో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ ఎంఇఒ మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

గుండెపోటుతో రిటైర్డ్ ఎంఇఒ ఈశ్వరయ్య మృతి చెందారు. మండలంలోని కన్యమడుగు లోని స్వగృహంలో శనివారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధృవీకరించారని అన్నారు. కన్యమడుగు, రేణుమాకుల పల్లె ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంగా పనిచేశారని, అనంతరం తంబళ్లపల్లె ఎంఇఒగా మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేసి మంచి గుర్తింపు పొందారని చెప్పారు. ఆయన భార్య ఉషారాణి గతంలో కన్యమడుగు పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నట్లు తెలిపారు. ఆయన మరణ వార్త తెలియగానే మండలంలోని పలువురు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు పలువురు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వైభవంగా అంకాళమ్మ జాతర

ప్రజాశక్తి-పీలేరు


ఆకట్టుకున్న చాందినీ బండి

పీలేరు మండలం, వేపులబైలు పంచాయితీ, కురవపల్లి సమీపంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ అంకాళమ్మ తల్లి ఆలయం వద్ద జాతర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ జాతరలో భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి తీసుకువచ్చిన చాందినీ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పీలేరు - మదనపల్లి మార్గంలోని రేపులబైలు సమీపంలో కొలువు దీరిన అంకాళమ్మ జాతర చివరి రోజైన ఆదివారం అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. వరపడిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయం భక్తులతో కళకళలాడింది. భక్తులు పిల్లల, కోలాటం, చెక్కభజనల బృందాలతో ప్రదర్శనలు, చాందినీ బండ్ల ఊరేగింపు వైభవంగా జరిగాయి. ఈ జాతర కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షలకు పాత్రులయ్యారు. ఆలయానికి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనానంతరం తీర్థ, ప్రసాదాల వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

ఘనంగా కోటకొండ గంగమ్మ తిరుణాల

తంబళ్లపల్లి : మండలంలోని కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లి, కొత్త కురువపల్లె, వద్ద వెలిసిన శ్రీ కోటకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి తిరుణాల వైభవంగా నిర్వహించారు. రెండు గ్రామాల మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి వీలు బోనాలు ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయంలో సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందిని బండ్ల మెరవాణి భక్తులను అల్లరింపజేసింది.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు : సిఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం


మాట్లాడుతున్న సిఐ పులిశేఖర్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదని, అలా ఎవరైనా గొడవలకు ప్రయత్నిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వాల్మీకిపురం సిఐ పులిశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్పి కృష్ణారావు ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళి, నిబంధనలను అనుసరించి ఎన్నికల తర్వాత, ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా నివారణా చర్యలో భాగంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజలెవ్వరూ గుంపులుగా చేరడం, ఊరేగింపులు నిర్వహించడం, సంబరాలు చేయడం, బాణా సంచా కాల్చడం, బాణా సంచా విక్రయించడం నిషేదమన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, పోలీసుల హెచ్చరికలను పాటించి, తమకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాగేశ్వర రావు, క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు

కొరవడిన అధికారుల పర్యవేక్షణ
అసలు ధర కంటే అధికంగా వసూలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట


పట్టణంలోని ఓ టీస్టాల్‌లో ఉన్న సబ్సిడీ సిలిండర్

స్థానిక పట్టణంలో హోటళ్లు, టీ దుకాణాల్లో కమర్షియల్ సిలిండర్ స్థానంలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారని, సామాన్య ప్రజలకు న్యాయం జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు.అధికారులు హోటళ్ల నిర్వాహకులు ,వ్యాపారస్తులతో కుమ్మక్కై ఇష్టానుసారంగా సిలిండర్లను సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకున్న తర్వాత వారికి రూ.939 చెల్లించాల్సిందిగా చరవాణికి సందేశమొస్తుందని, అయితే గ్యాస్ వారు రూ.960 నుంచి 980 దాకా వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇదేమిటని ప్రశ్నిస్తే గ్యాస్ సరఫరా చేసినందుకు సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్నామని సమాధానమిస్తున్నారని అంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదు కిలోమీటర్ల పరిధి లోపల సబ్సిడీ గ్యాస్ సిలిండర్లకు సర్వీస్ ఛార్జీలు విధించారదని స్పష్టంగా ఉందన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని హోటళ్లు, వ్యాపార సముదాయాలకు అడిగిన వెంటనే సబ్సిడీ సిలిండర్లను అంది స్తు న్నారని, సామాన్య ప్రజలు గ్యాస్ బుక్ చేస్తే మాత్రం వారం రోజులు సమయం పడుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కొన్ని హోటళ్లకు గుట్టు చప్పుడు కాకుండా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్నట్లు ఆరోపణ ఉన్నాయని అన్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి సబ్సిడీ సిలిండర్లను బ్లాక్ అమ్ముడు పోకుండా, సర్వీస్ ఛార్జీలను విధించ కుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుండ్లూరుపై అరవపల్లె విజయం


మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న అహ్మద్

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్లో భాగంగా నాగిరెడ్డి పల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవ పల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటులో ఆదివారం ఉదయం జరిగిన మ్యాచ్ నందు గుండ్లూరు జట్టు పై అరవపల్లెకు చెందిన రైజింగ్ స్టార్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన గుండ్లూరు జట్టు 13.4 ఓవర్లలో 69 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం విజయం కోసం కోసం బరిలో దిగిన రైజింగ్ స్టార్ జట్టు కేవలం 5.3 ఓవర్లలో 70 పరుగులు చేసి విజయం సాధించింది. అరవపల్లె క్రీడాకారుడు జాఫర్ అలీ ఖాన్ 45 పరుగులు చేయగా, బౌలర్ చంద్ర 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని చాపల మధు చేతుల మీదుగా అందుకున్నారు.

వెంకట రాజంపేట జట్టుపై మంటపంపల్లె విజయ దుందుభి

మధ్యాహ్నం వెంకట రాజంపేట గోపి లెవెన్స్, మట్టపం పల్లె ముద్దు కృష్ణారెడ్డి జట్ల మధ్య మ్యాచ్ ఆసక్తికరంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన వెంకటరాజంపేట జట్టు 13.5 ఓవర్లలో 89 పరుగులకు ఆల్ అవుట్ అయింది అనంతరం 90 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన ముద్దుకృష్ణారెడ్డి జట్టు 9 ఓవర్లలో 93 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్లో రెండు వికెట్లు తీయడంతో పాటు 28 పరుగులు చేసిన అహ్మద్ కు మాన్ అఫ్ ది మ్యాచ్ ట్రోఫీని ఏఎస్ఐ శంకర్ నాయక్ అందజేశారు. మధ్యాహ్నం జరిగిన పోటీలో రెండు టీంల నుండి హైదరాబాద్, కర్ణాటక తో పాటు ఇతర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొనడంతో మైదానం మొత్తం క్రీడాకారులతో నిండిపోయింది. ఈ మ్యాచ్‌కు జాతీయ వికలాంగ క్రికెట్ క్రీడాకారుడు శివకోటి సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు మున్న అంపేర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ పల్లె గ్రీష్మంత్ రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్ ,రంజిత్ క్రీడాకారులు క్రీడాభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'మానవత'కు ప్రజల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి-రాయచోటి


సమావేశానికి హాజరైన మానవతా సభ్యులు

విలువలతో కూడిన మానవతా సంస్థకు ప్రజలు ఇస్తున్న సహకారం మరువలేని ప్రతి ఒక్కరిలో జాలి, దయాగుణం కలిగి ఉండాలని మానవతా సమస్త గౌర సలహాదారుల వెంకటరమణ, కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో సెక్రటరీ వెంకట రమణ నాయుడు, ఉపాధ్యక్షులు సంచుల ఖాదర్‌బాషా అధ్యక్షతన మానవత నెలవారీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మానవత సంస్థ ద్వారా రాయచోటి లో అనేక సేవ కార్యక్రమాలు కొనసాగిస్తు న్నామన్నారు. అదే విదంగా మొక్కలు పెంపొందించే కార్యక్రమం తో పాటు విద్యార్థులకు నైతిక విలువల పై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. మానవత సేవలు విస్తృతంగా కొనసాగిచడంలో దాతల సహకారం మరువలేనిదని అన్నారు. 2024-25 కు సంబంధించి మానవత సంస్థలో స్వచ్చందంగా సేవ చేయాలనే సహృదయం కలిగిన వారు వారి పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. మానవత సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి ప్రారంబించిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 60 వేలు పైచిలుకులు సభ్యులతో 115 మండలాల్లో మానవత శాఖలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో కుడా అందరి సహకారంతో మానవత సేవలు మరింత విస్తృతంగా కొనసాగేలా కృషి చేస్తామని అన్నారు. సోమవారం తిరుపతి జిల్లా తిరుచానూరు అనంత రెసిడెన్సీలో జరిగే మానవత సంస్థ సమావేశానికి వ్యవస్థాపకులు కుడా హాజరవుతారని, రాయచోటి శాఖ తరపున పాల్గొని విజయవంతం కోరారు. కార్యక్రమంలో మానవతా కో-చైర్మన్ షకీల్, ఆర్‌వి. రాజు, మాజీ అధ్యక్షులు గుండ్లపల్లి వెంకటేష్, శ్రీధర్, మానవతా సభ్యులు పాల్గొన్నారు.

మాధవి ఆస్పత్రిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం

ప్రజాశక్తి-పీలేరు


మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

పీలేరు మాధవి ఆస్పత్రిలో వైద్య సేవలు అందుకునే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉందని మాధవి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ఏ. మాధవి తెలిపారు. ఆదివారం స్థానిక మల్లెల వారి వీధిలోని మాధవి హాస్పిటల్‌లో డాక్టర్ మాధవి రెడ్డి మాట్లాడుతూ పీలేరు, పరిసర ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా గర్భవతులు, సంతాన లేమితో బాధపడే వారికి తాము గత పది సంవత్సరాలుగా వైద్య సేవలు అంది స్తున్నామని చెప్పారు. తమ దగ్గర అత్యాధునిక ల్యాప్రోస్కోపిక్ పరికరాలతో పాటు లాపరోస్కోపిక్ సర్జరీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. తాము గతంలో ఎన్నో హైరిస్క్ కేసులకు వైద్యం అందజేశామని కూడా తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తమ వైద్యశాలలో చికిత్స పొందాక వారు చెల్లించే వైద్య ఖర్చులను ఫీ రీఎంబర్స్ మెంట్ ద్వారా తిరిగి ప్రభుత్వం నుంచి పొందే సాలభ్యం ఉందని అన్నారు. ఈ సేవలు తమ వైద్యశాలలో కొత్తగా అందుబాటులోకి వచ్చాయని వారు తెలియజేశారు. రీయంబర్స్ మెంట్ సేవలు అందుబాటులోకి రావటంతో తాము అందించే మరిన్ని వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, తమ నుంచి ప్రవేట్ హెల్త్ ఇన్సూరన్స్ క్యాష్ లెస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మాధవి రెడ్డి కోరారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

ప్రజాశక్తి- కడప అర్బన్

పాత బస్టాండ్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న మెయిన్ రోడ్‌లో ఒక వ్యక్తి పర్సు పోగొట్టుకున్నాడు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో అటువైపు వెళుతున్న ఎపి39-విసి-6076 నంబర్ గల ఆటో డ్రైవర్ షేక్ షరీఫ్ దొరికిన పర్సును ఎస్ఐ టి.శ్రీనివాసులుకు అప్పగించారు. పర్సును పరిశీలిస్తే అందులో రూ.18500వేలు డబ్బులు, అతని ఐడి కార్డ్స్ ఉండినట్లు గుర్తించారు. విషయాన్ని సిఐ దృష్టికి తీసుకువెళ్లారు. సిఐ ఆదేశాలు మేరకు పర్సులోని ఓటర్ ఐడి ప్రకారం ప్రొద్దుటూరుకు చెందిన రెడ్డి వెంకట చరణ్ తేజ్ గా గుర్తించారు. అతని సెల్ ఫోన్ నంబర్ తెలుసుకొని స్టేషన్‌కు పిలించి పర్సును, రూ.18500, ఐడెంటి కార్డ్స్ చరణ్ తేజ్ కు అప్పగించారు. ఆటో డ్రైవర్ షరీఫ్‌ను ఎస్ఐ రంగ స్వామి అభినందించారు.

హజ్ యాత్రపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని కృష్ణ సర్కిల్ దగ్గర ఉన్న హోటల్ షాహి బ్యాంకెట్ హాల్‌లో కౌమి టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ హష్మతుల్లా ఆధ్వర్యంలో హజ్ యాత్ర వెళ్లే వారికి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బి.ఎస్.గౌసులాజం, నంద్యాల ఎమ్మెల్సీ సి.ఇషాక్ బాషా, డిప్యూటీ సిఎం అంజాద్‌బాష సోదరుడు, ఎస్‌బి అహ్మద్ బాష, కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ షేక్. ఇషాక్ అలీ, కౌమి ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ సయ్యద్ హిదాయతుల్లా హాజయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన హజ్ యాత్ర చేస్తున్న ప్రతి ఒక్కరూ ఎంతో అదృష్టవంతులన్నారు. హజ్ యాత్ర చేస్తున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. కౌమి టూర్స్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమన్నారు అనంతరం హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ వేసి కిట్లను పంపిణీ చేశారు. వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు, హజ్ యాత్రికులు పాల్గొన్నారు.

వైవీయూ అభివృద్ధి విచ్ఛిన్నానికి కుట్ర

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం భవనాలు నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి తరలించడం దారుణమని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. అంకన్న పేర్కొనా్రను. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైవీయూ విసి చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య రాజకీయ ప్రమేయంతో ఒత్తిళ్లకు తలొగ్గి భవనాల అప్పగింతకు సిద్ధమాయ్యారని, వాటిపై రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కు ఫిర్యాదు ఫిర్యాదు చేస్తామన్నారు. యోగివేమన విశ్వవి ద్యాలయం సంబం ధించిన భవనాలు ఏకపక్షంగా డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ విశ్వవిద్యాలయానికి ఇవ్వడం పట్ల విద్యార్థులకు నూతన కోర్సులు ఇవ్వడానికి ఇబ్బందిగా మారుతున్నాయి తెలిపారు. మూడు సంవత్సరాల్లో కొత్తగా కంప్యూటర్ సైన్స్, ఉర్దూ,నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్స్, ఫుడ్ కోర్స్ ఇలా ఏర్పాటు చేశారని చెప్పారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన ఉందని పేర్కొన్నారు. ఇవన్నీ వసతులను బట్టే వచ్చాయని తెలిపారు. కానీ వర్సిటీ అభివృద్ధిని పక్కన పెట్టి డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్‌ఫైనార్ట్స్ రిజిస్ట్రార్ ఈ.సి. సురేం ద్రనాథ్ రెడ్డి ఒత్తిడితో వైవీయూ ముక్కలు చేసేందుకు వి.సి. చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య నిర్ణయించుకున్నారని విమర్శించారు. కార్యక్ర మంలో పిడిఎస్‌యు జిల్లా నాయకులు స్వరూప్ తేజ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అలరించిన జబర్దస్త్ ఈవెంట్

ప్రజాశక్తి కడప అర్బన్

డ్రీమ్ మీడియా, పార్క్ ఈవెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జబర్దస్త్, స్థానికులు ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అనీషా, సుజాత మాట్లాడుతూ రాయచోటి రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కడప కన్వెన్షన్ సెంటర్లో కామెడీ షో నిర్వహించామని తెలిపారు. జబర్దస్త్ టీం లో వెంకీ మంకీ, మోహన్, రాజమౌళి, అప్పారావు హాజరయ్యారని తెలిపారు. పులివెందుల నుంచి స్థానికంగా టీం హాజరయ్యారని చెప్పారు. స్మైలీ ఈవెంట్స్, కిడ్స్ డాన్స్ అలరించాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో స్పాన్సర్స్ సుజాత, అనుబేగ్, రాజేష్, సునీల్ పాల్గొన్నారు.


కామెడీ కిట్స్ చేస్తున్న జబర్దస్త్ టీం


రాజేంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

అభివృద్ధికి స్ఫూర్తి ప్రదాత కెకె.రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జన్మనిచ్చిన సొంతూరి రుణం తీర్చుకునేందుకు ఎన్ఆర్ఐ కెకె రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పెద్దకారంపల్లి పంచాయతీ అరుంధతివాడలో సుమారు 70 సంవత్సరాల తర్వాత జరుగుతున్న మాతమ్మ జాతరకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామ సర్పంచ్ అచ్చమ్మతో పాటు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఐ కెకె రెడ్డి పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తన తల్లిదండ్రులైన మున్నూరు రామలక్ష్మమ్మ, మన్నూరు నారాయణరెడ్డి చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా పెద్దకారంపల్లి అభివృద్ధికి నిరంతరం ఎన్ఆర్ఐ, కెకె.రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ అచ్చమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మన్నూరు రామలక్ష్మమ్మ, మన్నూరు నారాయ ణరెడ్డి చారిటబుల్ ఫౌండేషన్ కార్యదర్శి శోభారాణి, ఎంపిటిసిలు వరదరాజు, గీతాంజలి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు స్పెషల్ డిఎస్‌పిలు నియామకం

ప్రజాశక్తి-రాయచోటి

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అన్నమయ్య జిల్లాకు ఇద్దరు స్పెషల్ డీఎస్పీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బి.మోహన్‌రావు, ఎస్.ఎస్.భాస్కరరావులను స్పెషల్ డిఎస్‌పిలుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వారు వెంటనే అన్నమయ్య జిల్లా ఎస్‌పి కార్యాలయంలో విధులు చేపట్టాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. వారు నేడు, రేపో బాధ్యతలు చేపట్టనున్నారు.

క్రైం కార్నర్


పట్టుబడిన నిందితులు, వాహనంతో పీలేరు పోలీసులు

డీజిల్ చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

మండల పరిధిలో జరుగుతున్న నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం పనులు, పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పనులకు వినియోగించే వాహనాల్లోంచి డీజిల్ చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పీలేరు సిఐ ఎన్.మోహన్ రెడ్డి తెలిపారు. జిఆర్ ఇన్ఫ్రా, పారా మౌంట్ కంపెనీల ఇంచార్జిల నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఆదివారం స్థానిక సదుం రోడ్డులోని జేవి నగర్ వద్ద ఉన్న నిందితులను తాను, తమ ఎస్ఐ ఎంకె నర్సింహుడు, సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. నిందితులు ఆగి ఉన్న రోడ్డు రోలర్, ప్రోక్లైనెర్ల నుంచి డీజల్ చోరీ చేసినట్లు తమ విచారణలో తేలిందని అన్నారు. చిత్తూరు జిల్లా, శాంతిపురం మండలం, కోలాల తిమ్మనపల్లికి చెందిన మురుగేష్ సురేష్ కుమార్, మంజునాథ కార్తీక్ , శాంతిపురం మండలం, జారబండ కొత్తూరుకు చెందిన నారాయణ స్వామి నాగరాజ (26)లను అరెస్టు చేసి వారి నుంచి 200 లీటర్ల ఆరు డీజిల్ క్యాన్లు, ఒక ప్లాస్టిక్ పైపు, ఇనప రాడ్, రూ.18,500 నగదు, టాటా యోధ వాహనం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి-చిన్నమండెం

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రం చిన్నమండెంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని దేవగుడిపల్లి గ్రామంలోని రాజీవ్‌కాలనీలో నివాసమున్న బాగేపల్లి నరసింహులు(23) అనే యువకుడు ఆదివారం మధ్యాహ్నం చిన్నమండెం పట్టణంలో ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి లారీని ఢీకొని తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయని తెలిపారు. స్థానికులు వెంటనే క్షతగాత్రుని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇటీవలె వివాహం జరిగిందని, ప్రస్తుతం అతని భార్య గర్భంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇళ్లలో చోరీ

విలువైన బంగారు వెండి, ఆభరణాలు సహా నగదు అపహరణ
రంగంలోకి దిగిన క్లూస్ టీం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లిలో పట్టపగలే దొంగలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి బంగారు వెండి నగదును లూటీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి పట్టణం, నీరు గట్టువారి పల్లెలోని రామిరెడ్డి లేఅవుట్‌లో నివాసమున్న చంద్రశేఖర్ ఇంటికి తాళాలు వేసుకుని తన భార్య పిల్లలతో కలిసి స్థానిక రాజానగర్‌లో చనిపోయిన బంధువుల ఇంటిలో 11వ రోజు జరుపుకునే కర్మ క్రియల్లో పాల్గొనేందుకు వెళ్లారని పేర్కొన్నారు. ఇంట్లో ఎవరు లేనిది గమనించిన దొంగలు పట్టపగలే తాళాలు పగలగొట్టి ఇంట్లోని బీరువా తెరచి, అర్ధ కిలో బంగారం, రెండు కిలోల వెండి, ఒక లక్ష 50 వేల నగదును దోచుకెళ్లారని తెలిపారు. స్థానిక కోళ్ల బైలు రోడ్డులో నివాముున్న ఓబుల్ రెడ్డి ఇంటికి తాళం వేసుకొని పెద్దమండెంలో జరుగుతున్న జాతరకు బంధువుల ఇంటికి వెళ్లాడని తెలిపారు. ఇంట్లో ఎవ్వరూ లేనిది గమనించిన దొంగలు తలుపులు తెరచి ఇంట్లో ఉన్న వెండి బంగారు నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. సాయంత్రం ఇంటికి వచ్చిన యజమానులు దొంగలు చోరీలు చేయడాన్ని గుర్తించి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. వెంటనే రంగం లోకి దిగిన క్లూస్ టీం దొంగల ఆచూకీ కోసం వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ పోలీసులు తెలిపారు.


వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం